RNI NO:APTEL /2023/90201

# రాజధాని వాయిస్

తెలుగు దినపత్రిక

web : www.rajadhanivoice.in rajadhanivoicedaily@gmail.com

సంపుటి : 02 | సంచిక : 310 | 01 గురువారం అక్టోబరు 2026 | ఎడిటర్ : పాగళ్ల పూర్ణచంద్రరావు | పేజీలు : 4 | వెల : రూ.1/-

విలేఖరులు కావలెను

రాజధాని వాయిస్ తెలుగు దినపత్రికలో కొనసాగుటకు గుంటూరు,పల్నాడు,జిల్లాలలో స్టాఫర్లు నియోజకవర్గాలకు ఇంచార్జులు మరియు మండలాల వారీగా విలేఖరులు కావలెను ఆసక్తి గలవారు సంప్రదించగలరు.

9030343195

అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును

# పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ

- 26 వేల మందికి పైగా లబ్ధిదారులకు పట్టాల అందజేత
- విజయవాడలో 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమం
- సొంత ఇల్లు పేదల జీవితకాల స్వప్నమన్న ముఖ్యమంత్రి



**విజయవాడ, రాజధాని వాయిస్:** రాష్ట్రంలోని పేద కుటుంబాలకు ఇళ్ల స్థలాల హక్కులను కల్పించే లక్ష్యంతో నిర్వహించిన 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. విజయవాడలోని మకినేని బసవపున్నయ్య స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది లబ్ధిదారులు పాల్గొన్నారు. పేదలకు సొంత ఇంటి కలను సాకారం చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్రంలో దశాబ్దాలుగా కొనసాగుతున్న ఇళ్ల స్థలాల పట్టాల సమస్యకు తమ ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపిందని చంద్రబాబు పేర్కొన్నారు. సొంత ఇల్లు అనేది ప్రతి కుటుంబానికి ఆత్మగౌరవానికి ప్రతీక అని అన్నారు. అనేక కుటుంబాలు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న సమస్యను పరిష్కరించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 26,401 మంది అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేశారు. మిగతా 2లో..

## దసరా మహోత్సవాలకు సీఎం చంద్రబాబుకు ఆహ్వానం



**అమరావతి, రాజధాని వాయిస్ :** విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహించనున్న దసరా మహోత్సవాలకు హాజరు కావాల్సిందిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును ఆలయ అధికారులు, ధర్మకర్తల మండలి సభ్యులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రిని కలిసి ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. అక్టోబర్ 11వ తేదీ నుంచి 20వ తేదీ వరకు దసరా మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. రాష్ట్రం నలుమూలలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా భారీ సంఖ్యలో భక్తులు ఉత్సవాలకు హాజరయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో చేపడుతున్న ఏర్పాట్ల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ముఖ్యమంత్రికి అమ్మవారి ప్రసాదాన్ని అందజేసి వేదాశీర్వచనం చేశారు. అమ్మవారి కృప రాష్ట్ర ప్రజలపై ఉండాలని ఆకాంక్షిస్తూ ఆశీర్వాదాలు అందించారు. ముఖ్యమంత్రి ఆలయ సంప్రదాయాలను గౌరవిస్తూ ప్రసాదాన్ని స్వీకరించారు. ఉత్సవాల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై ముఖ్యమంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. దర్శనం, తాగునీరు, పారిశుద్ధ్యం, రవాణా, భద్రత తదితర అంశాల్లో ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు అన్ని విధాలుగా సౌకర్యాలు కల్పించాలని, సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లను విజయవంతం చేయాలని అధికారులకు సూచించారు. భక్తులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడం ప్రాధాన్యతగా తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దుర్గగుడి ధర్మకర్తల మండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్, కార్యనిర్వహణాధికారి శీనా నాయక్, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు. దసరా మహోత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## మలయాళ మనోరమ ప్రతినిధులతో నారా లోకేష్ సమావేశం



**కొచ్చి, సెప్టెంబర్ 30 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి నారా లోకేష్ కొచ్చిలో మలయాళ మనోరమ సంస్థ ప్రతినిధులతో సమావేశమయ్యారు. మలయాళ మనోరమ మేనేజింగ్ ఎడిటర్ జాకబ్ మాథ్యూ, ప్రధాన సహాయ సంపాదకుడు, డైరెక్టర్ రియాద్ మాథ్యూతో అల్పాహార సమావేశంలో పాల్గొని పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా దక్షిణ భారత అభివృద్ధి, ప్రాంతీయ అవకాశాలు, భవిష్యత్ లక్ష్యాలపై అభిప్రాయాలను పంచుకున్నారు. కేరళ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అభివృద్ధి ప్రయాణం, ఆర్థిక అవకాశాలు, పెట్టుబడుల ఆకర్షణ, మౌలిక సదుపాయాల విస్తరణ వంటి అంశాలు చర్చకు వచ్చినట్లు సమాచారం. రెండు రాష్ట్రాలు తమ ప్రత్యేకతలతో దేశ అభివృద్ధికి అందిస్తున్న సహకారంపై సమావేశంలో చర్చించినట్లు వెల్లడించారు. ప్రాంతీయ స్థాయిలో పరస్పర సహకారం అవసరాన్ని ప్రస్తావించారు. దక్షిణ భారత రాష్ట్రాలకు ఉన్న సామర్థ్యాలు, దేశ ఆర్థికాభివృద్ధిలో వాటి పాత్రపై విస్తృతంగా అభిప్రాయాల మార్పిడి జరిగింది. పరిశ్రమలు, విద్య, సాంకేతిక రంగం, సేవల రంగంలో దక్షిణ రాష్ట్రాలు ముందంజలో ఉన్నాయని సమావేశంలో ప్రస్తావించినట్లు తెలిసింది. దేశ అభివృద్ధి తదుపరి దశలో ఈ రాష్ట్రాలు కీలక పాత్ర పోషించే అవకాశాలపై చర్చించారు. ప్రాంతీయ అభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాలు, పెట్టుబడుల ప్రోత్సాహం, నూతన ఆవిష్కరణల ప్రాధాన్యం వంటి అంశాలపై కూడా అభిప్రాయాలు పంచుకున్నట్లు సమాచారం. రాష్ట్రాల మధ్య అనుభవాల మార్పిడి, పరస్పర సహకారం ద్వారా మరింత పురోగతి సాధించవచ్చని సమావేశంలో అభిప్రాయపడినట్లు తెలిసింది. దక్షిణ భారత సంస్కృతి, ఆర్థిక బలం, విద్యా పురోగతి దేశ అభివృద్ధికి కీలకమని నారా లోకేష్ పేర్కొన్నట్లు సమాచారం. వివిధ రంగాల్లో రాష్ట్రాలు సాధిస్తున్న విజయాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని అభిప్రాయపడ్డారు. అభివృద్ధి లక్ష్యాల సాధనలో సమన్వయం అవసరమని అన్నారు. మలయాళ మనోరమ ప్రతినిధులతో జరిగిన ఈ సమావేశం సానుకూల వాతావరణంలో సాగినట్లు తెలుస్తోంది. దక్షిణ భారత రాష్ట్రాల భవిష్యత్ అవకాశాలు, సమగ్ర అభివృద్ధి, దేశ పురోగతిలో వాటి పాత్ర వంటి అంశాలపై చర్చ జరగడం ప్రాధాన్యత సంతరించుకుంది. సమావేశం అనంతరం పరస్పర అభినందనలు తెలియజేసుకున్నారు.

## జగన్ వద్ద నన్ను దుర్మార్గుడిగా చిత్రీకరించింది సజ్జలే: విజయసాయిరెడ్డి



**విశాఖపట్నం, రాజధాని వాయిస్:** ప్రజలపై వైకాపా నేతలది బూటకపు ప్రేమ అని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి అన్నారు. మద్యం కుంభకోణంలో తన పాత్ర లేదని.. దీనికి కర్త, కర్మ, క్రియ రాజ్ కెసిరెడ్డేనని చెప్పారు. త్వరలో పార్టీ పేరును ప్రకటిస్తానని.. ఆ తర్వాత పాదయాత్ర చేస్తానన్నా రు. సజ్జల రామకృష్ణారెడ్డి వల్లే వైకాపాకు నష్టం జరుగుతోందన్నారు. జగన్ వద్ద నన్ను దుర్మార్గుడిగా చిత్రీకరించిన వ్యక్తి ఆయనేనని విమర్శించారు. రాజధాని అమరావతికి తాను వ్యతిరేకం కాదన్నా రు. విశాఖపట్నంలో నిర్వహించిన మీడియా సమావేశంలో విజయసాయిరెడ్డి మాట్లాడారు. "విశాఖను రాజధానిగా చేస్తామని చెప్పి వైకాపా మాట మార్చింది. నాడు విశాఖ రాజధాని అని చెప్పినవాళ్లు.. ఇప్పుడు మావిగన్ అంటున్నారు. ఈ నగరాన్ని అభివృద్ధి చేస్తామని మాట తప్పిన వైకాపా ప్రజలకు క్షమాపణ చెప్పాలి. ఆ పార్టీ హయాంలో నేను కీలకపాత్ర పోషించాననేది అవాస్తవం. అధికారంలోకి వచ్చేంతవరకు వైకాపా నన్ను వాడుకుంది. నాపై కుట్రలు, దుష్ప్రచారం చేశారు. మూడు నెలల్లో నన్ను పక్కనపెట్టారు. జీవీఎంసీ ఎన్నికల్లో వైకాపాను ప్రస్తుత ఇన్‌ఛార్జ్ గెలిపించగలరా? మద్యం కుంభకోణం కేసులో నాకు తెలిసిందంతా అధికారులకు చెప్పాను" అని విజయసాయిరెడ్డి తెలిపారు.

ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర క్యాబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలను కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. 2027-28 ఏడాదికి గోధుమలకు కనీస మద్దతు ధరను క్వింటాల్‌కు రూ.25 చొప్పున పెంచుతూ కేంద్రమంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. దీంతో క్వింటాల్‌కు మద్దతు ధర రూ.2,610కు చేరింది. గోధుమలతో పాటు మరికొన్ని పంటలకు సైతం మద్దతు ధరను పెంచింది. దేశ రాజధాని దిల్లీలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టింది. దీనికోసం రూ.1,789 కోట్ల అంచనా వ్యయంతో 'ఇంటెలిజెంట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ వ్యవస్థ' అమలుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. రియల్ టైమ్ ట్రాఫిక్ డేటా, అడాప్టివ్ సిగ్నల్స్, ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ వ్యవస్థల ద్వారా దిల్లీలోని 42 కారిడార్లలో ట్రాఫిక్‌ను సజావుగా నిర్వహించేలా ఈ ప్రాజెక్టు వీలు కల్పిస్తుందని అశ్వినీ వైష్ణవ్‌వివరించారు. 135 గిగావాట్ల పునరుత్పాదక ఇంధనాన్ని వినియోగించుకునేలా విద్యుత్ వ్యవస్థ ఏర్పాటుకు రూ.1.86 లక్షల కోట్ల వ్యయంతో కూడిన 'గ్రీన్ ఎనర్జీ కారిడార్ ఫేజ్-3'కి కేంద్ర మంత్రివర్గం పచ్చజెండా ఊపింది. 2030 నాటికి 500 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని సాధించాలనే లక్ష్యంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకుంది. దేశంలో పాత నేర చట్టాల స్థానంలో భారతీయ న్యాయసంహిత (బీఎన్ఎస్) అమల్లోకి వచ్చాక కేసుల విచారణ వేగవంతమైందని.. ఇటీవల జరిగిన ఓ హత్య కేసులో ఎనిమిది రోజుల్లోనే తీర్పు వచ్చిందని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు.

## ఈసీ అక్రమాలపై ఐక్యంగా పోరాడతాం: ఇండియా కూటమి




**రాజధాని వాయిస్** కేంద్ర ఎన్నికల సంఘం తీరుకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా నిరసనలు, మార్చ్ చేపట్టాలని 'ఇండియా కూటమి' నేతలు నిర్ణయించారు. బుధవారం జరిగిన సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అక్టోబర్ 2నుంచి 8వరకు వారం రోజుల పాటు 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి' అనే నినాదంతో పాదయాత్ర చేపట్టనున్నట్టు ప్రకటించారు. అక్టోబర్ 6న ఈసీ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి నిరసన తెలియజేస్తామన్నారు. అక్టోబర్ రెండో వారంలో రాష్ట్రపతిని కలిసేందుకు అపాయింట్‌మెంట్ కోరనున్నట్లు వెల్లడించారు. కేంద్ర దర్యాప్తు సంస్థలను, ఎన్నికల సంఘాన్ని భాజపా నేతలు ఏ రకంగా స్వాధీనం చేసుకుంటున్నారో రాష్ట్రపతికి వివరించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కేంద్రం, ఎన్నికల కమిషన్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. 'ఎన్నికల్లో జరుగుతున్న అక్రమాలపై మేమంతా (ఇండియా కూటమి నేతలు) ఐక్యంగా పోరాడతాం. అధికారం కోసం మోదీ, అమిత్ షా ఈసీని ఓ రబ్బర్ స్టాంపులా వినియోగిస్తున్నారు. ఓటర్ జాబితాలో అవకతవకలను ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆధారాలతో చూపించినా ఈసీ పట్టించుకోలేదు. ఈవీఎంల పనితీరుపై ఎంతో కాలంగా సమాధానం కోరుతున్నా స్పందించ లేదు. ఇకపై ఈవీఎంల స్థానంలో బ్యాలెట్ పేపర్లు తీసుకురావాలి. సర్ ప్రక్రియకు ముందున్న ఓటర్ల జాబితానే ఎన్నికల సమయంలో పరిగణలోకి తీసుకోవాలి' అని డిమాండ్ చేశారు. తమ స్వలాభం కోసం దేశంలోని ప్రజాస్వామ్యాన్ని నాశనం చేసిన వారికి తగిన శిక్ష పడాల్సిందేనని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. 'వారు ఎంత పెద్దవారైనా తప్పు చేస్తే శిక్ష అనుభవించాల్సిందే. భారత ప్రజాస్వామ్యం ఈ దేశంలోని ప్రతి ఒక్కరి కన్నా ఎంతో గొప్పది. ఎన్నికల్లో అవకతవకలు జరిగాయని మేం చెప్పే మాటలు నిజమేనని ఇప్పుడు ప్రజలకు కూడా తెలిసింది. ఈ ప్రభుత్వ అవినీతిని వారే ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తన తప్పు ఒప్పుకొని, పదవికి రాజీనామా చేయాలి. ఆయన పదవి నుంచి వైదొలగకపోతే ఆందోళన మరింత తీవ్రతరం చేస్తాం' అని రాహుల్ గాంధీ హెచ్చరించారు. బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సైతం జ్ఞానేశ్ కుమార్‌పై విమర్శలు గుప్పించారు. ఇండియా కూటమి సమావేశంలో విపక్ష పార్టీలకు చెందిన పలువురు అగ్రనేతలు పాల్గొన్నారు.



**మచిలీపట్నం, రాజధాని వాయిస్ :** మాజీ మంత్రి, వైకాపా జిల్లా అధ్యక్షుడు పేర్ని నాని వ్యవహార శైలిపై మంత్రి కొల్లు రవీంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పిచ్చి ప్రేలాపనలు మాని చర్చకు రావాలంటూ సవాల్ విసిరారు. బుధవారం మచిలీపట్నంలో కూటమి నాయకులతో కలిసి మంత్రి కొల్లు మీడియాతో మాట్లాడుతూ.. ఇటీవల పేర్ని తనపై చేసిన ఆరోపణలపై మండిపడ్డారు. 15 ఏళ్లు ఎమ్మెల్యేగా, రెండున్నరేళ్లు మంత్రిగా పనిచేసిన పేర్ని తన హయాంలో నియోజకవర్గానికి మేలు చేయకపోగా.. బందరు పోర్టును గోగిలేరుకు తరలించే ప్రతిపాదనపై సంతకం చేసిన ద్రోహాన్ని, పోర్టు నిర్మాణం పూర్తి చేయకపోతే ముక్కు నేలకు రాసుకుంటా నంటూ చేసిన నాటి ప్రకటనను ప్రజలు ఇంకా మర్చిపోలేదన్నారు. అతని రాజకీయ జీవితం మొత్తం వ్యక్తిగత స్వార్థంతోనే ముడిపడి ఉందన్నారు. "కుటుంబ రాజకీయ ప్రయోజనాల కోసం సొంత పార్టీకి చెందిన మున్సిపల్ ఛైర్మన్‌గా పని చేసిన చలమలశెట్టి విజయలక్ష్మిని పెట్టిన ఇబ్బందులు. వైస్ ఛైర్మన్ కాగిత సీతారామరాజును పావుగా వాడుకున్న వైనం. ఎస్సీ కమిషన్ ఛైర్మన్‌గా పని చేసిన విక్టర్‌ప్రసాద్‌ను ఇబ్బందులు పెట్టడం, ఎస్సీ వర్గానికి చెందిన పరిశుద్ధబాబును ఛైర్మన్‌గా నిలబెట్టి వెన్నుపోటు పొడవటం. ఛైర్మన్‌లుగా పని చేసిన మైనార్టీ, బీసీ వర్గాలకు చెందిన వారిని రబ్బరు స్టాంపులుగా వాడుకున్న విషయం. బీసీ నాయకుడు బలగం పీతాంబరేశ్వరరావును ఛైర్మన్ కాకుండా అడ్డుకోవడం" వంటి అన్ని విషయాలు ప్రజలకన్నా ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలకే ఎక్కువగా తెలుసన్నారు. మాట్లాడే మాటలు వ్యక్తిగత ప్రతిష్ఠను పెంచేలా ఉండాలని, అందుకు భిన్నంగా ప్రజలు సైతం సిగ్గుపడేలా మాట్లాడుతున్న పేర్ని.. ఇకనైనా తీరుమార్చుకుని నియోజకవర్గ అనూహ్య అభివృద్ధికి సహకరిస్తే మేలని హితవు పలికారు.

## ఏపీలో 'సర్' షెడ్యూల్‌ను సవరించిన కేంద్ర ఎన్నికల సంఘం

**అమరావతి, రాజధాని వాయిస్:** ఏపీలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ గడువును కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) మరోసారి పొడిగించింది. అక్టోబరు 16న తుది జాబితా ప్రకటించాలని నిర్ణయించింది. వచ్చే నెల 10 వరకు నోటీసులు, క్లెయిమ్‌లు, అభ్యంతరాలు పరిశీలించాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేసింది. క్లెయిమ్స్, అభ్యంతరాల పరిష్కారానికి అక్టోబరు 5 వరకు అవకాశం కల్పిస్తామని, అక్టోబర్ 9న తుది ఓటర్ల జాబితా విడుదల చేస్తామని గతంలో ఈసీ ప్రకటించింది. తాజాగా ఆ గడువును మరోసారి పొడిగించింది. సవరించిన షెడ్యూల్‌ను రాజకీయ పార్టీలకు రాతపూర్వకంగా తెలియజేయడంతో పాటు, మీడియా ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని ఈసీఐ ఆదేశించింది.

## కృష్ణానదిపై మరో రెండు బ్యారేజీల నిర్మాణం: సీఎం చంద్రబాబు

**విజయవాడ, రాజధాని వాయిస్ :** భవిష్యత్తులో రాజధాని అమరావతిలో వంతెనలు, భారీ భవంతులు, బుల్లెట్ రైళ్లు వస్తాయని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో జరిగిన 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. "ప్రపంచంలోనే నెంబర్ వన్ క్యాపిటల్‌గా అమరావతి తయారవుతుంది. ఇప్పటికే విజయవాడ, గుంటూరులో భూముల విలువ పెరిగింది. త్వరలో ఇన్నర్ రింగ్‌రోడ్డు, ఆ తర్వాత ఔటర్ రింగ్‌రోడ్డు వస్తాయి. అనేక నగరాలకు కనెక్టివిటీ వస్తుంది. విశాఖపట్నం నుంచి చెన్నై వరకు నాలుగు లేన్ల రైల్వే ట్రాక్ వస్తుంది. ఇవన్నీ పూర్తయితే అమరావ తి, గుంటూరు, విజయవాడ ఒక్కటై.. అమరావతి అన్‌స్టాపబుల్ సిటీగా తయారవుతుంది. కృష్ణానదిపై ప్రకాశం బ్యారేజీ ఉంది. దీనికి ఎగువన వైకుంఠపురం వద్ద, దిగువన చోడవరం వద్ద మరో రెండు బ్యారేజీల నిర్మాణం చేపడతాం. దీంతో విజయవాడ మొత్తం నీటితో కళకళలాడుతుంది" అని సీఎం తెలిపారు.

## మహిళల కోసం భవిష్యత్తులో ఏసీ బస్సులు కొంటాం: చంద్రబాబు

**విజయవాడ, రాజధాని వాయిస్ :**ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నామని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. విజయవాడలో నిర్వహించిన 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. "డబుల్ ఇంజిన్ సర్కార్ జెట్ స్పీడ్‌తో దూసుకెళ్తోంది. ఇవాళ 26,401 మందికి ఇళ్ల పట్టాలు అందిస్తున్నాం. గత వైకాపా పాలనలో ధ్వంసమైన రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నాం. కొందరు నేతలు మీ భవిష్యత్తుతో ఆటలాడుకున్నారు. గత ప్రభుత్వం భూ సర్వే పేరుతో ప్రతి ఊరిలో వివాదాలు సృష్టించింది. మీ ఆస్తులపై, పాస్‌బుక్‌లపై వారి బొమ్మలు వేసుకున్నారు. మేం మాత్రం ప్రభుత్వ రాజముద్రతో పాస్‌బుక్‌లు, పట్టాలు ఇస్తున్నాం. వైకాపా పాలనకు, కూటమి ప్రభుత్వ పాలనకు తేడా గమనించాలి.మొన్న విశాఖలో, నిన్న మంగళగిరిలో నేడు విజయవాడలో పేదలకు పట్టాలు ఇవ్వడం జీవితంలో మర్చిపోలేను. మొత్తం 60 వేల మందికి పట్టాలు ఇచ్చాం. దీని విలువ సుమారు రూ.52 వేల కోట్లు. ఇవాళ పేదల ఆత్మగౌరవానికి పట్టాభిషేకం జరుగుతోంది. పేదల చిరకాల వాంఛ నెరవేర్చాం. వారు ఆనందంగా ఉండటమే నిజమైన అభివృద్ధి. ఈ ఆస్తిని అమ్ముకోవద్దు, భవిష్యత్తు కోసం ఉంచుకో ండి. 108 ఏళ్ల నుంచి ఉన్న సమస్యలకు పరిష్కారం చూపిస్తు న్నాం. పేదలకు సేవ చేయాలనే ఉద్దేశంతోనే మూడు పార్టీలు కలిశాయి. స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయా ణం కల్పిస్తున్నాం. మహిళల కోసం భవిష్యత్తులో ఏసీ బస్సులు కొంటాం" అని సీఎం అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు సత్యకుమార్, నాదెండ్ల మనోహర్, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా ప్రకటిస్తాం.. రూ.లక్ష కోట్లతో అభివృద్ధి: మంత్రి సవిత

**కడప,రాజధాని వాయిస్ :** 'రైజింగ్ రాయలసీమ' కోసం రాయలసీమ బిడ్డగా ముఖ్యమంత్రి చంద్రబాబు అహర్నిశలు పోరాడుతున్నారని మంత్రి సవిత తెలిపారు. రాయలసీమ హార్టికల్చర్ హబ్‌కు సంఘీభావంగా పులివెందులలో టీడీపీ నేతలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మంత్రి సవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా సీఎం ప్రకటిస్తారని చెప్పారు. హార్టికల్చర్ హబ్ కోసం లక్ష కోట్లు ఖర్చు చేస్తామన్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టులకు రూ.26 వేల కోట్లు కేటాయిస్తామని వెల్లడించారు.ప్రతి ఎకరాకు నీరు అందించడంతో పాటు వేర్ హౌజ్, కోల్డ్ స్టోరేజ్ నిర్మాణాలు చేపడతామని మంత్రి తెలిపారు. పులివెందులకు కూడా వైఎస్ జగన్ సాగు నీరు ఇవ్వలేకపోయారని విమర్శించారు. పులివెందులలో రూ.480 కోట్లతో తాగు నీరు అందిస్తున్నామని తెలిపారు. ఇటీవల పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ప్రజలు టీడీపీని భారీ మెజారిటీతో గెలిపించారని అన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో పులివెందుల మున్సిపాలిటీలో ప్రజలు టీడీపీని గెలిపించాలని కోరారు. పులివెందుల అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు కట్టుబడి ఉన్నారని మంత్రి సవిత స్పష్టం చేశారు.

## రాజస్థాన్‌తో చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేయాలి: హరీశ్‌రావు

హైదరాబాద్: సింగరేణి ఆధ్వర్యంలోని జైపూర్ విద్యుత్ విషయ ంలో రాజస్థాన్‌తో చేసుకున్న ఒప్పందాన్ని వెంటనే రద్దు చేసుకోవా లని మాజీమంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి విద్యుత్ వ్యవస్థ నిర్వహణలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ఒకవైపు కరెంటు లేక రైతుల పంటలు కళ్లెదుటే ఎండిపోతుంటే, మరోవైపు మన రాష్ట్రంలో తక్కువ ఖర్చుతో ఉత్పత్తయ్యే విద్యుత్‌ను ఇతర రాష్ట్రాల కు ధారాదత్తం చేసేందుకు సిద్ధపడటం ప్రజా వ్యతిరేక చర్య కాక మరేమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. "మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌కు కావాల్సిన బొగ్గు మన సింగరేణి గనుల్లోనే ఉంది... నడపడానికి కావాల్సిన నీళ్లు పక్కనే ఉన్న గోదావరి నుంచే పుష్కలంగా అందుతాయి. బొగ్గు మనది, నీళ్లు మనవి, స్థలం మనది... అలాంటప్పుడు ఇక్కడ కొత్తగా చేపడుతున్న విస్తరణలో 800 మెగావాట్ల విద్యుత్‌ను రాజస్థాన్‌కు కట్టబెట్టేలా జాయింట్ వెంచర్ ఒప్పందం చేసుకోవ డం వెనుక ఆంతర్యం ఏమిటి? మన బొగ్గు, మన నీళ్లు, మన ప్రాంతంలో తయారయ్యే కరెంటుపై హక్కు తెలంగాణదే కదా. ఇటీవల సింగరేణి సంస్థ రాజస్థాన్‌కు చెందిన ఆర్‌ఆర్వీయూ ఎన్ఎల్ విద్యుత్ సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం కొత్తగా నిర్మించే థర్మల్ విద్యుత్‌లో 800 మెగావాట్లు రాజస్థాన్‌కు కేటాయిస్తారు" అని హరీశ్‌రావు లేఖలో పేర్కొన్నారు.. తెలంగాణ ప్రజల ఆస్తి సింగరేణి... అలాంటి సింగరేణి విద్యుత్‌ను, పెట్టుబడిని రాజస్థాన్ అభివృద్ధికి ఎందుకు మళ్లించాలని ప్రశ్నించారు. మన రాష్ట్రమే కరెంటు లేక అల్లాడుతున్న వేళ ఈ తొందరపాటు నిర్ణయం ఎందుకని ప్రశ్నించారు. రైతులకు 24 గంటల విద్యుత్ ఇస్తున్నామని చెప్పి కనీసం 7..8 గంటలు కూడా ఇవ్వలేకపోతున్నారని విమర్శించారు.

## దర్గా ఖబరిస్థాన్ అభివృద్ధి పనులకు శ్రీకారం

**- రూ.11.62 లక్షలతో మౌలిక సదుపాయాల కల్పన**
**- ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న మంత్రి కొల్లు రవీంద్ర**
**- ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు**



**మచిలీపట్నం, రాజధాని వాయిస్ :** మచిలీపట్నం నగరంలోని 26వ డివిజన్ జవ్వారుపేటలో ఉన్న హజ్రత్ సయ్యద్ షా దర్గా ఖబరిస్థాన్ వద్ద చేపట్టనున్న అభివృద్ధి పనులకు రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, బీజేపీ నాయకుడు పంతం గజేంద్రతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఖబరిస్థాన్ పరిసరాల్లో రూ.11.62 లక్షల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనుల ద్వారా మౌలిక సదుపాయాలు మెరుగుపడనున్నాయని మంత్రి తెలిపారు. స్థానిక ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ప్రార్థనా స్థలాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు. అభివృద్ధి పనుల ప్రారంభం అనంతరం మంత్రి దర్గాను సందర్శించి ముస్లిం మత పెద్దలతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, శాంతి సామరస్యాలు మరింత బలపడాలని ఆకాంక్షిస్తూ ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మత పెద్దలు మంత్రికి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి వర్గ ప్రజలకు అవసరమైన సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మతాలకు అతీతంగా అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రజల అభ్యర్థనలకు అనుగుణంగా మౌలిక వసతుల అభివృద్ధి చేపడుతున్నామని చెప్పారు.ఖబరిస్థాన్ వద్ద చేపట్టనున్న పనులు పూర్తయితే స్థానికులకు మరింత సౌకర్యం కలుగుతుందని మంత్రి అన్నారు. ప్రజల సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. నగరంలోని ఇతర ప్రాంతాల్లో కూడా అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ముస్లిం మత పెద్దలు, అధికారులు, పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజా సంక్షేమం, మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు.

## పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలి: పయ్యావుల కేశవ్

**- పాఠశాల కమిటీల నూతన చైర్మన్లు, సభ్యులతో భేటీ**
**- విద్యార్థులకు మెరుగైన సౌకర్యాల కల్పనపై సూచనలు**
**- ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించాలని పిలుపు**



**ఉరవకొండ, రాజధాని వాయిస్ :** ఉరవకొండ నియోజకవర్గ వ్యాప్తంగా నూతనంగా ఎన్నికైన ప్రభుత్వ పాఠశాల కమిటీల చైర్మన్లు, సభ్యులు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఉరవకొండలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల సంక్షేమం, విద్యా ప్రమాణాల మెరుగుదలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ ప్రతినిధులకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాల కమిటీలకు విద్యా వ్యవస్థ బలోపేతంలో కీలక బాధ్యత ఉందని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు చైర్మన్లు, సభ్యులు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధి, విద్యా నాణ్యత పెంపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు.విద్యార్థులను ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దడంలో పాఠశాలల పాత్ర ఎంతో ముఖ్యమని పయ్యావుల కేశవ్ అన్నారు. విద్యతో పాటు క్రమశిక్షణ, విలువలు, సామాజిక బాధ్యతలపై కూడా విద్యార్థులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్ తరాలను తీర్చిదిద్దే బాధ్యతలో కమిటీలు చురుకుగా వ్యవహరించాలని సూచించారు. ప్రభుత్వం విద్యా రంగానికి ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు, అవసరమైన మౌలిక వసతులు, నాణ్యమైన విద్య అందించేందుకు పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల విజయవంతమైన అమలులో పాఠశాల కమిటీల సహకారం అవసరమని అన్నారు. పాఠశాలల్లో ఎదురయ్యే సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కమిటీ సభ్యులకు మంత్రి సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని కోరారు. విద్యార్థుల అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పాల్గొన్న చైర్మన్లు, సభ్యులు పాఠశాలల అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తామని మంత్రికి హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలను మరింత అభివృద్ధి చేసి విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. సమావేశం అనంతరం మంత్రి వారితో కలిసి జ్ఞాపక చిత్రాలు దిగారు.

## రైతు బజార్లలో కిలో ఉల్లి రూ.35.. ఒక్కో కార్డుదారుడికి 2 కిలోల పంపిణీ: మంత్రి నాదెండ్ల



**విజయవాడ, రాజధాని వాయిస్ :** ఏపీలోని రైతు బజార్లలో ఉల్లిపాయలను కిలో రూ.35లకు అందించే కార్యక్రమా న్ని బుధవారం తమ ప్రభుత్వం చేపట్టిందని ఆంధ్రప్రదేశ్ పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. విజయవాడలోని ఏఐసీసీ కాలనీ రైతు బజార్‌లో ఉల్లిపాయల పంపిణీని మంత్రి ప్రారంభించారు. ఒక్కో రేషన్ కార్డుదారుడికి రెండు కిలోల చొప్పున ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు.

**బియ్యం, ఉల్లి, పప్పులు సబ్సిడీపై అందించేలా ఏర్పాట్లు..**

కూటమి ప్రభుత్వంలో ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నామని మంత్రి నాదెండ్ల ఉద్ఘాటించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పరిణామాలతో ధరలు పెరుగుతున్నాయని వివరించారు. ప్రజలపై భారం పడకుండా సబ్సిడీపై అందిస్తున్నామని చెప్పుకొచ్చారు. ధరల స్థిరీకరణకు నిధిని ఏర్పాటు చేసి, ఎప్పటికప్పుడు సమీక్ష చేస్తున్నామని తెలిపారు. బియ్యం, ఉల్లి, పప్పులు సబ్సిడీపై అందించేలా ఏర్పాట్లు చేశామని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

## నవంబరు 10 నుంచి పలు రైళ్ల రద్దు, దారి మళ్లింపు

**తిరుపతి, రాజధాని వాయిస్:** రేణిగుంట రైల్వేస్టేషన్ యార్డ్ ఆధునీకరణ పనుల్లో భాగంగా రైలు మార్గాలను అనుసంధానం చేస్తున్న కారణంగా నవంబరు 10నుంచి డిసెంబరు 27వ తేది వరకు పలు రైళ్లను రద్దు చేస్తూ, మరికొన్ని రైళ్లను దారి మళ్లించనున్నట్లు దక్షిణ కోస్తా రైల్వే జోనల్ అధికారి విజయ్‌కిషన్ తెలిపారు. రేణిగుంట – నిశ్చింతపూర్ మధ్య వస్తు రవాణా చేసే నాలుగు రైళ్లను రద్దు చేశారు. రోజువారీగా రాకపోకలు సాగించే కడప – అరక్కోణం, తిరుచానూరు – అరక్కోణం, చెన్నై – తిరుచానూరు, గూడూరు – రేణిగుంట, నెల్లూరు – రేణిగుంట మధ్య రోజువారీ రాక పోకలు నిర్వహించే ప్యాసింజర్ రైళ్లను 48 రోజుల పాటు రద్దు చేశారు. అలాగే చెన్నై – తిరుపతి మధ్య రోజువారీగా రాకపోకలు నిర్వహించే సప్తగిరి ఎక్స్‌ప్రెస్‌ను 27 రోజులు రద్దు చేశారు. తిరుపతి, తిరుచానూరు, రేణిగుంట నుంచి రాకపోకలు నిర్వహించే పలు ఎక్స్‌ప్రెస్‌లను కొద్ది రోజులు రద్దు చేశారు. తిరుపతి – విశాఖపట్ట ణం మధ్య వారంలో మూడు రోజులు నడుస్తున్న డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్‌ను డిసెంబరు 9 నుంచి 26వ తేది వరకు ఆది, సోమ, బుధ, గురు, శుక్ర, శనివారాల్లో రద్దు చేశారు. అలాగే తిరుచానూరు నుంచి నాందేడ్, జాల్నా, కాచిగూడ, చర్లపల్లి మధ్య రాకపోకలు నిర్వహించే ఎక్స్‌ప్రెస్ రైళ్లను రెండు రోజులు రద్దు చేశారు. అలాగే రేణిగుంట – మైసూరు మధ్య నడు స్తున్న ఎక్స్‌ప్రెస్‌ను డిసెంబరు 11, 12, 18, 19, 25, 26 తేదీల్లో రద్దు చేశారు. తిరుపతి – భువనేశ్వర్ మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ రైలును డిసెంబరు 12, 13, 14, 19, 20, 21, 26, 27 తేదీల్లో రద్దు చేశారు.

# పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ




ఎన్టీఆర్ జిల్లాలో లబ్ధిదారులకు సగటున 130 గజాల స్థలానికి పట్టాలు మంజూరు చేసినట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. ఇది పేదల జీవితాల్లో కొత్త అధ్యాయానికి నాంది పలికే కార్యక్రమమని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేస్తున్నామని చంద్రబాబు అన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా నెరవేర్చుతు న్నామని చెప్పారు. పేదలకు ఆస్తి హక్కులు కల్పించడం ద్వారా వారి భవిష్యత్తుకు భరోసా కల్పిస్తున్నా మని వివరించారు.ఇప్పటివరకు విశాఖపట్నం, మంగళగిరి, విజయవాడలో నిర్వహించిన కార్యక్రమాల ద్వారా సుమారు 60 వేల మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేసినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఈ ఆస్తుల మొత్తం విలువ సుమారు రూ.52 వేల కోట్లకు పైగా ఉంటుందని చెప్పారు. లబ్ధిదారులు ఈ ఆస్తులను విక్రయించకుండా భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా కాపాడుకోవాలని సూచించారు. మహిళల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని చంద్రబాబు తెలిపారు. మహిళల కోసం అమలు చేస్తున్న ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని ప్రస్తావిస్తూ, భవిష్యత్తులో శీతలీకరణ సౌకర్యం కలిగిన బస్సుల్లో కూడా ఉచిత ప్రయాణం కల్పించే దిశగా చర్యలు చేపడతామని వెల్లడించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వివేకా హత్య కేసులో ఆరోపణలపై ఎందుకు మౌనం?.. జగన్‌కు మంత్రి నిమ్మల సూటి ప్రశ్న

**అమరావతి, రాజధాని వాయిస్:** మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. జగన్ అవినీతి, నేరపూరిత మనస్తత్వం ముందు అంతర్జాతీయ మాఫియా డాన్లు కూడా దిగదుడుపే అంటూ ఎద్దేవా చేశారు. తాను చేసిన ఘోర నేరాలు, హత్యలను ఇతరులపైకి నెట్టేసి తప్పించుకోవడంలో జగన్ సరికొత్త నేర పాఠాలు నేర్పారని విమర్శించారు. కేవలం ఆర్థిక ఉగ్రవాదిగానే కాకుండా, నేర సామ్రాజ్యానికే జగన్ అసలైన సూత్రధారిగా మారారని అన్నారు. తాత రాజారెడ్డి నాటి ఫ్యాక్షన్ క్రూరత్వాన్ని అందిపుచ్చుకుని, అనుచరులకు 'రప్పా రప్పా' అంటూ హింసా సంస్కృతిని నూరిపోస్తున్నారని మండిపడ్డారు. సొంత బాబాయ్‌ని గొడ్డలితో హత్య చేయించి, ఆ కేసుతో సంబంధమున్న వారిని వరుసగా అనుమానాస్పదంగా అంతమొందిస్తున్నారని ఆరోపించారు.నాడు లోటస్ పాండ్‌లో బటన్ నొక్కితేనే.. పులివెందులలో బాబాయ్ ప్రాణాలు గాల్లో కలిశాయని మంత్రి వ్యాఖ్యానించారు. సునీల్ యాదవ్ ఇచ్చిన సంచలన వాంగ్మూలంపై జగన్మోహన్ రెడ్డి ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. దస్తగిరి నుంచి సునీల్ యాదవ్ వరకు.. తాడేపల్లి ప్యాలెస్ కేంద్రంగా సాగిన కుట్రల గుట్టును రట్టు చేశారని తెలిపారు. అంతఃపుర రహస్యాలను, సాగిన నెత్తుటి కుట్రలను జగన్ తక్షణమే ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. జగన్, అవినాష్ రెడ్డిల నుంచే తనకు ప్రాణహాని ఉందని నిందితుడు సునీల్ యాదవే స్వయంగా వెల్లడించారని అన్నారు.వివేకా కేసును నెత్తికెత్తుకుంటే శివశంకర్ రెడ్డి రూ.10 కోట్లు ఇస్తానన్నట్లు కువైట్ గంగాధర్ రెడ్డి సీబీఐకి సాక్ష్యమిచ్చారని నిమ్మల తెలిపారు. వివేకా కేసుతో లింకున్న కసనూరు శ్రీనివాస్ రెడ్డి, ఈసీ గంగిరెడ్డి, కువైట్ గంగాధర్ రెడ్డి, డ్రైవర్ నారాయణ, వైఎస్ అభిషేక్ రెడ్డి, వాచ్‌మన్ రంగయ్యలు అనుమానాస్పదంగా ప్రాణాలు కోల్పోయారని అన్నారు. కేసులో కీలక సాక్షిగా మారిన సునీల్ యాదవ్‌పై ఇప్పటికే మూడుసార్లు హత్యాయత్నం జరిగిందని చెప్పారు. రూ.40 కోట్ల భారీ సుపారీ వెనుక ఉన్న అసలైన అంతిమ లబ్ధిదారు జగనేనని స్వయంగా నిందితులే స్పష్టం చేశారని అన్నారు. ప్రభుత్వంపై బురదజల్లడానికి ముందుండే వ్యక్తి.. సొంత బాబాయ్ హత్య కేసులో నిందితులే నేరుగా వేలెత్తి చూపుతున్నా ఎందుకు నోరు మెదపడం లేదని నిలదీశారు. నిందితుల వాంగ్మూలాలపై జగన్ పాటిస్తున్న మౌనం ముమ్మాటికీ నేరాన్ని అంగీకరించడమే అని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.



# గుంటూరులో ఘనంగా అబ్దుల్ కలాం జయంతి, మోడీ ప్రజాసేవ వేడుకలు!



**గుంటూరు,రాజధాని వాయిస్ :** ప్రధాని నరేంద్ర మోడీ 25 సంవత్సరాల ప్రజా సేవను పూర్తి చేసుకున్న సందర్భంగా సేవా – సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా మరియు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి ఉత్సవాల సందర్భంగా (అక్టోబర్ 15) బిజెపి మైనార్టీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు అబ్దుల్ అలీం ఆధ్వర్యం లో పట్టాభిపురం రెండో లైనులోని పట్టాభిపురం హైస్కూల్ నందు వేడుకలు ఘనంగా నిర్వహించారు.ముందుగా పట్టాభిపురం స్కూల్లో ని విద్యార్థిని విద్యార్థులకు క్విజ్ మరియు వ్యాసరచన వకృత్వ పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి బహుమతి ప్రధానం చేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ బాషా విచ్చేసి మాట్లాడుతూ భారతరత్న ఏపీజే అబ్దుల్ కలాం చిన్నప్పటి నుంచి పేదరికంలో ఉన్న ఆయన కన్న కలలు సాకారం కోసం పేపర్ బాయ్ నుంచి మిస్సైల్ మెన్ వరకు మరియు భారత రాష్ట్రపతి అయ్యేంతవరకు ఆయన నిరంతర కృషి పట్టుదల, ఆయన దృఢ సంకల్పం మరియు దేశం పట్ల ఆయనకున్న అభిమానం గొప్పదని కొనియాడారు.ఈ కార్యక్రమంలో భాగంగా సేవ సంకల్ప్ అభయాన్ కార్యక్రమం పోస్టర్ కూడా విడుదల చేయడం జరిగింది.దేశం పట్ల విద్యార్థులు వారి యొక్క జీవితాన్ని తీర్చిదిద్దడంలో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం సంకల్పం చాలా గొప్పదని తెలియజేసినారు.మైనార్టీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు అబ్దుల్ అలీమ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బిజెపి గుంటూరు జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరపతిరావు బిజెపి జిల్లా మైనార్టీ మోర్చా అధ్యక్షుడు షేక్ సాంబశివరావు బజరంగ్ రామకృష్ణ, నారాయణరెడ్డి, వైవి సుబ్బారావు మండల అధ్యక్షురాలు భూలక్ష్మి ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు దారా అంబేద్కర్ మరియు నాయకులు కార్యకర్తలుపాల్గొన్నారు.

## బుర్రిపాలెంలో అక్టోబర్ 4న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన!



**తెనాలి,రాజధాని వాయిస్ :** తెనాలి మండలం బుర్రిపాలెంలో ఉన్నత అధికారులు బుధవారం పర్యటించారు. రాష్ట్ర ముఖ్యమ ంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రులు అక్టోబర్ 4వ తేదీన పి.ఎం.ఏ.వై గ్రామీణ్ క్రింద మంజూరైన గృహ నిర్మాణాలకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ మేరకు గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి హెప్సీబా రాణి కొర్రపాటి, జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ, కేంద్ర మంత్రి పి.ఎస్ ఏ.కె.సింగ్, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవతో ఏర్పాట్లు పరిశీలించారు. బుర్రిపాలెం గ్రామం పొలిమేరల్లో బహిరంగ సభను ఏర్పాటు చేస్తున్నారు. గ్రామంలో శంకుస్థాపన చేసిన అనంతరం, పలువురు లబ్ధిదారులతో మాట్లాడవచ్చని భావిస్తున్నారు. వీటన్నింటి దృష్ట్యా ఏర్పాట్లు పక్కాగా చేయాలని ఆయా శాఖల అధికారులను ఆదేశిం చారు. ఐదు వేల మంది వరకు ప్రజలు బహిరంగ సభకు హాజరు కావచ్చని అందుకు తగిన విధంగా తాగు నీరు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఇప్పటికే జిల్లా పంచాయతీ అధికారి సాయి కుమార్ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు ముమ్మరం గా జరుగుతున్నాయి. రహదారి మరమ్మతుల పనులు ఆర్ అండ్ బి పర్యవేక్షక ఇంజనీర్ ఆర్.శ్రీనివాస మూర్తి నేతృత్వంలో చేపడుతు న్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతి బసు,జిల్లా పరిషత్ ఉప ముఖ్య కార్యనిర్వహణ అధికారి సి.హెచ్. కృష్ణ, తెనాలి రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీరమణి, గుంటూరు రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, ఆర్ అండ్ బి పర్యవేక్షక ఇంజనీర్ ఆర్.శ్రీనివాస మూర్తి, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె.కళ్యాణ చక్రవర్తి, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జె.వి.ఎస్.ఆర్.కె.ప్రసాద్. జిల్లా పౌర సరఫరాల అధికారి పి.కోమలి పద్మ, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.విజయ లక్ష్మి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్, తహసిల్దార్ గోపాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అక్టోబర్ 1 నుంచి ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ!



**గుంటూరు, రాజధాని వాయిస్ :** గుంటూరు జిల్లాలో అక్టోబర్ నెలకు సంబంధించిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ అక్టోబర్ 1వ తేదీ ఉదయం నుండి జరుగుతుందని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ తెలిపారు. ఈ మేరకు బుధవారం సంబంధిత అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. అక్టోబర్ 1వ తేదీన పింఛను తీసుకోలేని వారికి అక్టోబర్ 3వ తేదీన అందజేస్తారని చెప్పారు. ఎస్.జీ.ఎస్.డబ్ల్యూ, ఇతర ప్రభుత్వ సిబ్బంది ద్వారా లబ్ధిదారుల ఇళ్ల వద్దనే పింఛన్లను పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. బ్యాంకుల నుండి నగదు పొందడం, సిబ్బందిని మ్యాపింగ్ చేయడం, పంపిణీ సక్రమంగా, సాఫీగా జరుగుటకు సరైన పర్యవేక్షణ, కార్యాచరణ తయారు చేసి సిద్ధంగా ఉండాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో 2,50,576 మందికి పింఛన్లు క్రింద 109.32 కోట్ల రూపాయలు పంపిణీ జరుగుతుందని చెప్పారు. పంపిణీ సమయంలో ఎటువంటి లోపాలు లేకుండా సిబ్బంది సంయమనంతో వ్యవహరించాలని చెప్పారు.

## వినుకొండలో డీజే శబ్ద కాలుష్యంపై సీపీఐ వినతి పత్రం!



**వినుకొండ,రాజధాని వాయిస్ :** వినుకొండ పట్టణంలో విచ్చలవిడిగా కొనసాగుతున్న డీజే శబ్ద కాలుష్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ,వినుకొండ పట్టణ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సీపీఐ పట్టణ కార్యదర్శి ఉలవలపూడి రాము ఆధ్వర్యంలో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఎస్‌హెచ్‌ఓ ప్రభాకర్ కు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఉలవలపూడి రాము మాట్లాడుతూ పట్టణంలో పగలు, రాత్రి అనే తేడా లేకుండా అధిక శబ్దంతో డీజేలు నిర్వహించడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్నవారు, గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారు, విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని పేర్కొన్నారు. విద్యాసంస్థలు, ఆసుపత్రుల పరిసర ప్రాంతాల్లో, అలాగే రాత్రి వేళల్లో అధిక శబ్దంతో డీజేలు నిర్వహించకుండా నిబంధనలను కఠినంగా అమలు చేయాలని కోరారు.నిబంధనలు ఉల్లంఘించే డీజే నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని,ప్రజలు రద్దీగా తిరిగే ప్రాంతాల్లో భారీ శబ్దాలు వచ్చే బాణాసంచా పేల్చడం పైనా నియంత్రణ చర్యలు తీసుకోవాలని రాము విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు చీరాల అంజయ్య, తోట నరసింహారావు, దుర్గా రెడ్డి, షేక్ ఇబ్రహీం, బిజ్జం రమేష్ రెడ్డి, షేక్ హుస్సేన్, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

## వినుకొండ జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు!



**వినుకొండ, రాజధాని వాయిస్ :** వినుకొండ పట్టణ పరిధిలోని గుంటూరు––కర్నూలు జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు పట్టణ సీఐ ప్రభాకర్ తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రహదారిపై తరచూ ప్రమా దాలు జరిగే ప్రాంతాలను గుర్తించి, వాహనాల వేగాన్ని నియంత్రించే చర్యలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు.వినుకొండ పట్టణ సమీపంలోని పసుపులేరు బ్రిడ్జి నుంచి పల్నాడు జిల్లా సరిహద్దులోని నీలగంగవరం జంక్షన్ వరకు ఉన్న జాతీయ రహదారిపై పలు ప్రాంతాలను బ్లాక్ స్పాట్లుగా గుర్తించారు. ఇటీవల రోడ్ సేఫ్టీ, రవాణా, పోలీస్, హైవే, పంచాయతీరాజ్ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు సంయుక్తంగా రహదా రిని పరిశీలించారు.ఈ పరిశీలనలో పసుపులేరు బ్రిడ్జి, ఢిల్లీ పబ్లిక్ స్కూల్, చీకటిగలపాలెం, అడ్డరోడ్డు, పార్వతీపురం, అందుగుల కొత్తపాలెం, నీలగంగవరం తదితర ప్రాంతాలను ప్రమాదకర ప్రాంతాలుగా గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు ఎస్ ఆకారంలో జిగ్‌జాగ్ ఏర్పాట్లు చేపట్టినట్లు సీఐ తెలిపారు.బ్లాక్ స్పాట్ల వద్ద జిగ్‌జాగ్ ఏర్పాటు చేయడం ద్వారా వాహనదారులు వేగాన్ని తగ్గించి జాగ్రత్తగా ప్రయాణించే అవకాశం ఉంటుందని, తద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని సీఐ ప్రభాకర్ పేర్కొన్నారు. రహదారిపై ప్రమాదాల నివారణకు అవసరమైన చోట మరిన్ని చర్యలు చేపడతామని తెలిపారు. అదేవిధంగా వినుకొండ––నరసరావుపేట రహదారిలోనూ ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి, అక్కడ కూడా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టనున్నట్లు సీఐ వెల్లడించారు. వాహనదారులు బ్లాక్ స్పాట్ల వద్ద అప్రమత్తంగా ఉండి, నిర్ణీత వేగ పరిమితులను పాటిస్తూ ప్రయాణించాలని ఆయన సూచించారు.

# తెనాలి తహసీల్దార్‌పై దూషణలు నిందితుడిని అరెస్ట్ చేయాలి!



**తెనాలి, రాజధాని వాయిస్ :** తెనాలి మండల తహసీల్దార్ మరియు మండల మేజిస్ట్రేట్ గోపాలకృష్ణ పై వ్యక్తిగతంగా అనుచిత వ్యాఖ్యలు చేస్తూ, ఆధారాలు లేని ఆరోపణలు చేయడంతో పాటు సోషల్ మీడియా మరియు ఇతర ప్రచార మాధ్యమాల ద్వారా ప్రతిష్ఠకు భంగం కలిగించే విధంగా ప్రచారం చేస్తున్న వ్యక్తిని వెంటనే అరెస్ట్ చేయాలని తెనాలి రిపబ్లికన్ పార్టీ సమన్వయకర్త తమనం భూషణం, తెనాలి ఐతానగర్ సమాధుల తోట సాధన కమిటీ, ప్రజాసంఘాలు మరియు వివిధ ప్రజా సంస్థల ప్రతినిధులు డిమాండ్ చేశారు.ఈ మేరకు తెనాలి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగింది.ఈ సందర్భంగా హెచ్‌ఆర్‌ఈసీఐ ఏపీ ఫోర్ జోనల్ ప్రెసిడెంట్ సినిమాల ప్రభాకర్ మాట్లాడుతూ, ప్రజా సమస్యలపై ప్రశ్నించడాన్ని ఎవరూ వ్యతిరేకించరని, అయితే ప్రభుత్వ అధికారిపై ఆధారాలు లేకుండా వ్యక్తిగత దూషణలు, అసత్య ఆరోపణలు చేస్తూ లక్ష్యంగా చేసుకుని ప్రచారం చేయడాన్ని సహించబోమని అన్నారు.తెనాలి ఐతానగర్ సమాధుల తోట స్థలం కోసం జరుగుతున్న ప్రజా ఉద్యమంలో తహసీల్దార్ గోపాలకృష్ణ అధికారిక విధుల్లో భాగంగా స్థల పరిశీలన, ప్రజలతో సమావేశాలు మరియు సంబంధిత అధికారులతో సమన్వయం వంటి కార్యక్రమాల్లో పాల్గొన్నారని తెలిపారు. అలాంటి అధికారిపై వ్యక్తిగతంగా దూషణలు చేయడం, ఆధారాలు లేని ఆరోపణలు చేయడం ప్రజల్లో అపోహలు సృష్టించే ప్రయత్నంగా భావిస్తున్నామని అన్నారు.ప్రజా సమస్యలపై ప్రశ్నించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది. అదే సమయంలో వ్యక్తిగత దూషణలు, బెదిరింపులు, అసత్య ఆరోపణలు చేసే హక్కు ఎవరికీ లేదు అని స్పష్టం చేశారు.సంబంధిత వ్యక్తి సోషల్ మీడియాలో చేసిన పోస్టులు, వీడియోలు, ప్రచార సామగ్రి మరియు ఇతర ఆరోపణలను పోలీసులు పరిశీలించి, జరిగిన వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టాలని, నేరం జరిగినట్లు నిర్ధారణ అయితే ఆ వ్యక్తిని తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ గోపాలకృష్ణ పై వ్యక్తిగత దూషణలు, ఆధార రహిత ఆరోపణలు చేసిన వ్యక్తిపై పోలీసులు వెంటనే చర్యలు తీసుకుని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తున్నామని, ఈ విషయంలో పోలీసులు స్పందించకపోతే ప్రజాసంఘాలు, సమాధుల తోట సాధన కమిటీ మరియు వివిధ ప్రజా సంస్థల ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య పద్ధతిలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.అధికారుల గౌరవానికి భంగం కలిగించే విధంగా వ్యక్తిగత దూషణలు, అసత్య ప్రచారం పునరావృతం కాకుండా పోలీసులు కఠినంగా వ్యవహరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో తమనం భూషణం, హెచ్‌ఆర్‌ఈసీఐ ఏపీ ఫోర్ జోనల్ ప్రెసిడెంట్ సినిమాల ప్రభాకర్, తెనాలి ఐతానగర్ సమాధుల తోట సాధన కమిటీ ప్రతినిధులు, ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## గుంటూరులో రూ.99.9 లక్షలతో రోడ్డు పనులకు శంకుస్థాపన!



**గుంటూరు, రాజధాని వాయిస్ :** గుంటూరు నగర పాలక సంస్థ,రూ.50 లక్షల వ్యయంతో 47 వ డివిజన్, గోరంట్ల తూర్పు బజార్ కన్నా లక్ష్మీ నారాయణ కాలనీ నుండి భాష్యం టైటానిక్ క్యాంపస్ వరకు రోడ్డు మరియు రూ.49.9 లక్షల వ్యయంతో 48 వ డివిజన్, రెడ్డిపాలెం హిమనీనగర్ జెండా చెట్టు సెంటర్ నుండి రెడ్డిపాలెం రోడ్డు వరకు గల రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన గౌరవ ప్రత్తిపాడు నియోజకవర్గ శాసనసభ్యులు డా. బూర్ల రామాంజనేయులు ఈ సందర్భంగా శాసనసభ్యులు వారు మాట్లాడుతూ రూ.99.9 లక్షలతో 47, 48వ డివిజన్లలో రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందని,ప్రజల సమస్యలను పట్టించుకోకుండా గత వైసీపీ ప్రభుత్వం కాలయాపన చేస్తే,నేడు ప్రజల అవసరాలను గుర్తించి కూటమి ప్రభుత్వం పనులతో సమాధానం చెబుతోందని,47 వ డివిజన్లో రూ.22 కోట్లకు పైగా పలు అభివృద్ధి పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని, అలాగే 48 వ డివిజన్లో రూ.25 కోట్లకు పైగా అనేక అభివృద్ధి పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే గారు స్పష్టం చేశారు.గత ప్రభుత్వ పాలనలో కనీసం ఒక తట్టెడు మట్టి కూడా వేయలేదని, రోడ్లన్నీ గుంతలతో ప్రజలు అనేక ఇబ్బందులు చవి చూసారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక అభివృద్ధి మరియు సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్నామని, వైసీపీ నాయకులకు నామినేషన్ వేసే కనీస అర్హత కూడా లేదని, ఈ సందర్భంగా ప్రజలకు సంక్షేమాన్ని అందించాలన్నా, రాష్ట్రాన్ని అభివృద్ధి పరచాలన్న , ప్రజా సేవకు పరితపించే నాయకులు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు కల్లూరి శ్రీనివాసరావు, రాష్ట్ర రైతు మీడియా కోఆర్డినేటర్ గింజుపల్లి వెంకటేశ్వరరావు,ప్రత్తిపాడు నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త కొర్రపాటి నాగేశ్వరావు, డివిజన్ పార్టీ అధ్యక్షులు దాది గోపాల్ యాదవ్, చెరుకుపల్లి నాగరాజు, కూటమి శ్రేణులు, అభిమానులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు, మహిళలు మరియు తదితరులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు దూరం.. లక్ష్య సాధనే ధ్యేయం కావాలి

**ఆధునిక సాంకేతికతను సమాజ హితానికి వినియోగించాలి**

**ముఖ్యఅతిథిగా పాల్గొని యువతకు మార్గనిర్దేశం చేసిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు**




**నరసరావుపేట,రాజధాని వాయిస్** నేటి ఆధునిక యుగంలో నవతరం (Gen-Z) విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉంటూ, ఉన్నత లక్ష్యాలతో ఉజ్వల భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు పిలుపునిచ్చారు. స్థానిక ఎస్ఎస్ఎన్ డిగ్రీ ఌ పీజీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన "Gen- స్టూడెంట్స్ ఇంట్రాక్ట్" సదస్సు అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఉన్నతికి, వ్యక్తిత్వ వికాసానికి ఉద్దేశించిన సూత్రాల అవగాహన బోర్డుపై ఎమ్మెల్యే స్వయంగా సంతకం చేసి విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. అనంతరం కళాశాల విద్యార్థులతో ఆయన నేరుగా ముఖాముఖి నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ మాట్లాడుతూ డిజిటల్ యుగంలో జెన్–జీ తరం ఆలోచనలు, విశ్లేషణ ఎంతో వినూత్నంగా ఉన్నాయని కొనియాడారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని కేవలం వినోదానికే పరిమితం చేయకుండా విజ్ఞాన సముపార్జనకు, స్టార్టప్‌లు, సరికొత్త ఆవిష్కరణల రూపకల్పనకు వేదికగా మార్చుకోవాలన్నారు. దేశ ప్రగతి యువత చేతుల్లోనే ఉందని, అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాలను పెంపొందించుకోవడంతో పాటు సమాజం పట్ల బాధ్యత, నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని సూచించారు. విద్యార్థులు తమ కెరీర్‌లో, నిత్య జీవితంలో తప్పనిసరిగా పాటించాల్సిన కీలక అంశాలపై ఆయన సమగ్ర అవగాహన కల్పించారు.కేవలం డిగ్రీ పట్టాకే పరిమితం కాకుండా కంప్యూటర్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, కమ్యూనికేషన్, ఇంగ్లీష్, డిజిటల్ స్కిల్స్ వంటి ఆధునిక నైపుణ్యాలను నేర్చుకోవాలని కోరారు. ఉద్యోగం కోసం వెతికే స్థాయి నుంచి స్టార్టప్‌లు, చిన్న వ్యాపారాల ద్వారా నలుగురికి ఉద్యోగం సృష్టించే ఎంటర్‌ప్రెన్యూర్లుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఏఐ మన ఉద్యోగాలను తీసుకుంటుందన్న భయం వీడి, ఏఐ ని సరైన రీతిలో వినియోగించుకునే నైపుణ్యాన్ని సాధించాలన్నారు. అలాగే సోషల్ మీడియాలోని ప్రతీ సమాచారం నిజం కాదని, ఏదైనా పోస్ట్ షేర్ చేసే ముందు వాస్తవాలను నిర్ధారించుకోవాలని (ఖీఖష్–ఎష్టవఎ) స్పష్టం చేశారు.రోజులో కొంత సమయాన్ని చదువు, నైపుణ్యాల సాధన, వ్యాయామం, కుటుంబానికి కేటాయిస్తూ సమయాన్ని విలువైనదిగా భావించాలన్నారు. పౌష్టికాహారం, నిత్య వ్యాయామం, సరైన నిద్రతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు. ముఖ్యంగా యువత ఏ పరిస్థితుల్లోనూ మత్తు పదార్థాల బారిన పడకూడదని, తీసుకునే ఒక్క తప్పుడు నిర్ణయం యావత్ జీవితాన్ని, భవిష్యత్తును నాశనం చేస్తుందని తీవ్రంగా హెచ్చరించారు. సంపాదన, పొదుపు, పెట్టుబడులపై అవగాహన పెంచుకుంటూ అనవసరపు అప్పులకు దూరంగా ఉండాలని హితవు పలికారు. ఓటు హక్కు వచ్చిన తర్వాత పూర్తి సమాచారంతో కూడిన సరైన నిర్ణయం తీసుకుంటూ ప్రజాస్వామ్య ప్రక్రియలో బాధ్యతాయుతంగా పాల్గొనాలని చెప్పారు. జీవితంలో ఒక పరీక్షలోనో, ఉద్యోగంలోనో, వ్యాపార ప్రయత్నంలోనో ఎదురయ్యే వైఫల్యం జీవితానికి ముగింపు కాదని, వైఫల్యాలను పాఠాలుగా మలచుకుని సరికొత్త పట్టుదలతో ముందుకు సాగాలని ధైర్యం చెప్పారు.అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ యువతకు స్ఫూర్తిదాయక సందేశమిస్తూ "మీ తరం భవిష్యత్తు కోసం ఎదురు చూసే తరం కాదు భవిష్యత్తును నిర్మించే తరం. చదువు, నైపుణ్యం, క్రమశిక్షణ, ఆరోగ్యం, సాంకేతిక పరిజ్ఞానం, ఈ ఐదు విషయాలను మీ జీవితంలో భాగం చేసుకోండి. సోషల్ మీడియాలో కనిపించే తాత్కాలిక ప్రశంసలను కాకుండా, నిజ జీవితంలో సాధించే శాశ్వత విజయాన్ని లక్ష్యంగా పెట్టుకోండి. మీ కుటుంబానికి, మీ గ్రామానికి, మన నియోజకవర్గానికి, దేశానికి ఉపయోగపడే ఉన్నత స్థాయికి ఎదగండి. మీ భవిష్యత్తే మన నియోజకవర్గం భవిష్యత్తు, మన దేశ భవిష్యత్తు" అని ఉద్ఘాటించారు. ఈ ముఖాముఖిలో ప్రస్తుత విద్యా విధానం, ఉద్యోగావకాశాలు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సవాళ్లపై విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు ఎమ్మెల్యే ఎంతో ఓపికగా, ఆత్మీయంగా సమాధానాలిస్తూ వారిలో సరికొత్త ఆత్మవిశ్వాసాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో కపలవాయి విజయకుమార్, మున్సిపల్ మాజీ చైర్మన్ నాగసరపు సుబ్బరాయ గుప్తా, కళాశాల యాజమాన్య ప్రతినిధులు, ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో డిగ్రీ, పీజీ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యా కమిటీ చైర్మన్‌గా లింగాల లక్ష్మయ్య



**కారంపూడి.సెప్టెంబర్ 30 రాజదాని వాయిస్ :**స్థానిక మండల కేంద్రం లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల మెయిన్ కారంపూడి నందు మంగళవారం జరిగిన పాఠశాల విద్యా కమిటీ ఎన్నికలలో లింగాల లక్ష్మయ్యను కమిటీ సభ్యులు పాఠశాల చైర్మన్గా మరియు వైస్ చైర్మన్ గా నాదెండ్ల షఫీయా పర్వీన్ లను ఏకగ్రీవంగా ఎన్నుకోవటం జరిగినది. ఈ సందర్భంగా పాఠశాల నూతన విద్యా కమిటీ చైర్మన్గా ఎన్నుకోబడిన లింగాల లక్ష్మయ్య మాట్లాడుతూ, పాఠశాల విద్యను అభివృద్ధి పరచడంలో ముందుకు తీసుకెళ్లడంలో నా వంతు కృషి చేస్తానని అలాగే పాఠశాలలో విద్యాపరంగా ఏ కార్యక్రమం జరిగిన దానికి తప్పకుండా సహకరిస్తానని తెలియపరచడం జరిగింది. తదుపరి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మరియు సిబ్బంది తల్లిదండ్రులు నూతనంగా ఏర్పడిన విద్యా కమిటీ సభ్యులను అభినందించారు.

# బ్రాహ్మణపల్లిలో స్వర్ణాంధ్రప్రదేశ్ పల్లె పండుగ 3.0

**పిడుగురాళ్ల.సెప్టెంబర్ 30,రాజధాని వాయిస్:** మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో పల్లె పండుగ 3.0 కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్ల గురజాల శాసన సభ్యుడు యరపతినేని శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నియోజకవర్గానికి 10 కోట్లు మంజూరు చేయడం జరిగిందని,దీనిలో భాగంగా 107 వర్క్స్ ముఖ్యంగా సిసి రోడ్లు , డ్రైన్ ల నిర్మాణం,విబిజి రామ్జి లో పెడుతున్నందున ఫండ్స్ కు ఎటువంటి ఇబ్బంది లేదని తెలిపారు. మెడికల్ కాలేజీలో ఈ ఏడాది 50 సీట్లతో సెషన్స్ ప్రారంభించడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ, రాష్ట్రంలో అనుభవజ్ఞుడైన ముఖ్యమంత్రి ఈ రెండున్నర ఏళ్ళలో అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమాలలో రాష్ట్రం ఎలా అభివృద్ధి చెందుతుందో




అందరం చూస్తున్నమన్నారు. నియోజకవర్గం పల్లె పండుగ బీటీ రోడ్స్, గ్రావెల్ రోడ్స్, సిమెంట్ రోడ్లు వంటి మౌలిక సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు,కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పల్నాడులో క్రీడా వికాసానికి బాటలు

**యువతకు మండవ రవి సేవలు స్ఫూర్తిదాయకం ఎమ్మెల్యే జూలకంటి**

**ఘనంగా 'ఎంపీఎల్' క్రికెట్ టోర్నీ ప్రారంభం**

**మాచర్ల. సెప్టెంబర్ 30 రాజధాని వాయిస్ :**పల్నాడు ప్రాంతంలో క్రీడా సంస్కృతి మరింతగా వెల్లివిరియాలని మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆకాంక్షించారు. బుధవారం స్థానిక కాసు బ్రహ్మానందరెడ్డి (ఎస్ కేబిఆర్) కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించిన 'మండవ మాచర్ల ప్రీమియర్ లీగ్' (ఎంపీఎల్) క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై, టాస్ వేసి ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,జాతీయ స్థాయి ప్రమాణాలతో స్థానిక యువత కోసం క్రికెట్ లీగ్‌ను ఏర్పాటు చేసిన నిర్వాహకుడు మండవ రవిని ప్రత్యేకంగా అభినందించారు. పట్టుదల, కఠోర శ్రమ ఉంటే క్రీడాకారులు ఏదో ఒక రోజు ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని పేర్కొన్నారు. క్రీడల్లో విశేష ప్రతిభ కనబరిచిన వారికి కూటమి ప్రభుత్వం డీఎస్సీ ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించి గౌరవిస్తుంటే, గత వైకాపా ప్రభుత్వం 'ఆడుదాం ఆంధ్ర' పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందని ఆయన ఆరోపించారు. వెనుకబడిన మాచర్ల నియోజకవర్గ యువతకు మండవ రవి చేస్తున్న సేవలకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. త్వరలోనే



నియోజకవర్గంలో క్రీడాకారుల కోసం నూతన స్టేడియం నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్నామని, అలాగే తన సొంత ఖర్చులతో నెట్ ప్రాక్టీస్ వసతులు సమకూరుస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు యాగంటి మల్లికార్జున రావు, కజ్జం సైదయ్య, యెనుముల కేశవరెడ్డి, మద్దిగపు వెంకటరామిరెడ్డి, టీడీపీ పట్టణాధ్యక్షుడు కొమెర దుర్గారావు, మదార్ సాహెబ్ తో పాటు టోర్నీ నిర్వాహక బృందం సభ్యులు అన్వర్ బాషా, క్రాంతి కుమార్, చిన్ని, కేపీచారి, సాంబపాల్గొన్నారు.

# పల్లె పండుగతో నిధులు ప్రవాహం

**మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా అడుగులు**

**ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మనందరెడ్డి**

**కారంపూడి.సెప్టెంబర్ 30రాజదాని వాయిస్ :** కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో పల్లెపండుగ కార్యక్రమం ద్వారా వేల కోట్ల నిధులతో రాష్ట్రంలోని గ్రామీణ మౌలిక వసతుల కల్పన జరుగుతోందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మనందరెడ్డి వెల్లడించారు. పల్లెపండుగ 3.0 కార్యక్రమంలో భాగంగా వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ ఆజీవికా మిషన్ -- గ్రామీణ' పథకం నిధులు ద్వారా నియోజకవర్గ వ్యాప్తంగా మౌళిక వసతుల కల్పన, మిని గోకుల షెడ్లు వంటి నిర్మాణాలకు రూ.10 కోట్ల మంజూరు కాగా.., బుధవారం కారంపూడి, దుర్గి మండలాల్లో పర్యటించి, పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు. ముందుగా కారంపూడి బీసీ కాలనీలో రూ. 23 లక్షలు, దుర్గి మండలం అడిగొప్పల గ్రామంలో రూ.20 లక్షలు, మండల పరిధిలోని ఓబులేసునిపల్లె గ్రామంలో రూ.40 లక్షలు, రూ.2 లక్షలు విలువ చేసే మిని గోకులం షెడ్, దుర్గి మండల కేంద్రంలో రూ. 47 లక్షలతో నూతన సీసీ రోడ్ల నిర్మాణాలకు భూమి పూజ చేసి, శిలాఫలకాలను ఆవిష్కరించారు. అనంతరం దుర్గి ఇందిరమ్మ కాలనీ రూ. 50 లక్షలతో నిర్మించిన నూతన సీసీ రోడ్డును ఎమ్మెల్యే



జూలకంటి బ్రహ్మనందరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవోలు శ్రీనివాసరెడ్డి, ప్రసాదరావు, పంచాయతీరాజ్ ఏఈ సత్యానారాయణ, కూటమి పార్టీల నాయకులు నాయకులు పంగులూరు అంజయ్య, పంగులూరి పుల్లయ్య, బొల్నేడి శ్రీనివాసరావు, మునుగోటి సత్యనారాయణ, లింగా బ్రహ్మయ్య, సీతారామాంజనేయులు, గోళ్ల సురేష్ యాదవ్, బాలకృష్ణ, తండా మస్తాన్ వలి, యాగంటి నరేష్, ఉన్నం మహేష్,గోపాల్, సింగు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ ఎన్నికల వేళ సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచాలి

**నకరికల్లు పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన పల్నాడు జిల్లా ఎస్పీ జగదీశ్ ఆదహళ్లి**

**నరసరావుపేట.సెప్టెంబర్ 30 రాజధాని వాయిస్ :**రాబోయే పంచాయతీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని పల్నాడు జిల్లా ఎస్పీ జగదీశ్ ఆదహళ్లి పోలీస్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన నకరికల్లు పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని పలు కీలక రికార్డులు, రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం స్థానిక ఎస్సైతో మాట్లాడి మండల పరిధిలోని సమస్యాత్మక గ్రామాలు, ప్రస్తుత శాంతిభద్రతలు, క్షేత్రస్థాయి పరిస్థితులపై ఆరా తీశారు. రానున్న ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిసేలా పోలింగ్ కేంద్రాలను నిరంతరం పర్యవేక్షించాలని, సమస్యాత్మక ప్రాంతాలకు సంబంధించి ముందస్తుగా పక్కా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు ప్రణాళికతో ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.అలాగే గ్రామీణ రహదారులపై ప్రమా



దాల నివారణకు ప్రత్యేక దృష్టి సారించాలని, రోడ్డు భద్రతా నిబంధనలపై నిరంతర నిఘా ఉంచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సత్తెనపల్లి రూరల్ సీఐ రవికిరణ్, నకరికల్లు ఎస్సై సతీష్ మరియు స్టేషన్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సాహితీ మానవతా శిల్పి

రాజధాని వాయిస్ :సెప్టెంబర్ 30.
ఇతివృత్తమున నవ్యత పాటించి
పాత్ర చిత్రణలో రసస్ఫూర్తి నింపి
మేటి భావాలను నేర్పుగా అల్లి
ఉత్తమ రచనలు అందించే బోయ
జంగయ్య
మనం మారాలి,
చిలక పలుకులు పలికి
ఆటలు పాటలు మాటల
ఆటలు రాసి
మన నేతలు మనవడు చెప్పిన కథలు
లిఖించి
బాల సాహితీ శిల్పిగా వెలుగొందేనే
చట్రాలలో నున్న సత్యాన్ని వెలికిదీయ
పలుకులకు పదును బెట్టి
కదిలించే భావాలను కలమున నింపి
వెలుతురు కవితలు ప్రసరింపచేసెనే
అభూత కల్పనలకు
చెల్లుచీటీ రాసి
వాస్తవిక ప్రపంచమునకు నడిపించి
బడుగు బతుకుల పోరాటాన్ని ఎచ్చరికగా
మలచి
సామాజిక పరివర్తనను కాంక్షించెనే
మూఢనమ్మకాలను పటాపంచలు చేస్తూ
జీవిత సత్యాలను ఆవిష్కరిస్తూ
దుష్ట సంప్రదాయాలను దూనుమాడుతూ
జాతరకు జీవము పోసెనే
దోపిడిదారుల వికృత బుద్ధిని
మనుషుల స్వార్థ చింతనని
గొర్రెలు కథా సంపుటిగా చిత్రించి
మానవతావాదియై వెలిగే సాహితీ
జగమున



(అక్టోబర్ ఒకటవ సాహితీ
మానవతామూర్తి బోయ జంగయ్య
జయంతి సందర్భంగా)
అనిల్ కుమార్ దారివేముల
మాచర్ల, పల్నాడు జిల్లా
9951244718.

# గుంటూరులో ఆపరేషన్ త్రిశూల్ ప్రారంభం

- నేరాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ
- మాదకద్రవ్యాల నిర్మూలనపై దృష్టి
- మహిళల భద్రత, రోడ్డు భద్రతకు ప్రాధాన్యం



**గుంటూరు,రాజదాని వాయిస్ ::** గుంటూరు జిల్లా ప్రజలకు మరింత సురక్షితమైన వాతావరణం కల్పించడంతో పాటు నేరాలను సమర్థవంతంగా నియంత్రించేందుకు "ఆపరేషన్ త్రిశూల్" పేరుతో ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ తెలిపారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌తో కలిసి కలెక్టరేట్‌లో నిర్వహించిన తొలి సమీక్ష సమావేశంలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. జిల్లాలో శాంతిభద్రతలను మరింత బలోపేతం చేయడం, నేరాల నివారణకు శాఖల సమన్వయంతో కార్యాచరణ అమలు చేయాలని అధికారులకు సూచించారు. మాదకద్రవ్యాల సరఫరా, వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. డ్రగ్స్ హాట్‌స్పాట్లను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు పాఠశాలలు, కళాశాలల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యాసంస్థల యాజమాన్యాలు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలోని మత్తు విముక్తి కేంద్రాన్ని మరింత మెరుగుపరచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.మహిళల భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని కలెక్టర్ తెలిపారు. మహిళలపై నేరాలను



నిరోధించేందుకు శక్తి బృందాల కార్యకలాపాలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. ప్రజా ప్రదేశాలు, విద్యాసంస్థలు, రవాణా కేంద్రాల వద్ద పర్యవేక్షణ పెంచి మహిళలకు సురక్షిత వాతావరణం కల్పించాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలను కఠినంగా అమలు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో గుర్తించిన ప్రమాదకర ప్రాంతాలపై నెల రోజుల్లో భద్రతా చర్యలు పూర్తి చేయాలని ఆదేశించారు. అమరావతి రాజధాని ప్రాంతంలో వాహనాల వేగ నియంత్రణ కోసం ప్రత్యేక పరికరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.జిల్లాలో నేరాల నియంత్రణ, మాదకద్రవ్యాల నిర్మూలన, మహిళల భద్రత, రోడ్డు భద్రత వంటి అంశాల్లో ప్రజల భాగస్వామ్యం అత్యంత అవసరమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి భద్రతా చర్యలకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ రమణమూర్తి, జిల్లా రెవెన్యూ అధికారి ఖాజావలి, ఆర్టీవో శ్రీహరి రావు తదితర అధికారులు పాల్గొన్నారు. ఆపరేషన్ త్రిశూల్ ద్వారా జిల్లాలో నేరాల సంఖ్యను గణనీయంగా తగ్గించడంతో పాటు ప్రజలకు భద్రతాభావాన్ని కల్పించడం లక్ష్యమని అధికారులు వెల్లడించారు. అన్ని శాఖల సమన్వయంతో కార్యాచరణ అమలు చేసి గుంటూరును మాదకద్రవ్యాలు, నేరాలు, ప్రమాదాల రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు చర్యలు కొనసాగనున్నాయి.

# ఎస్ఎంసీ ఎన్నికలపై కలెక్టర్ సమీక్ష

**అనకాపల్లి, రాజదాని వాయిస్ :** జిల్లాలో పాఠశాల నిర్వహణ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల నిర్వహణ, ఎదురైన సమస్యలు, ఘర్షణలు, వాయిదా పడిన ఎన్నికల పరిస్థితులపై అధికారులతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. ఎన్నికల ప్రక్రియలో తలెత్తిన వివాదాలను చట్టపరమైన నిబంధనల మేరకు పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. ఎక్కడైనా సమస్యలు తలెత్తినట్లయితే వెంటనే స్పందించి పరిస్థితిని అదుపులోకి తీసుకురావాలని అధికారులకు ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, నిష్పాక్షికత పాటించాలని స్పష్టం చేశారు.వాయిదా పడిన ఎన్నికలను సంబంధిత మార్గదర్శకాల ప్రకారం త్వరితగతిన నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. విద్యాశాఖ, రెవెన్యూ, పోలీసు శాఖల మధ్య సమన్వయం ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. అనకాపల్లి పరిధిలోని 79 పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు విజయవంతంగా పూర్తయ్యాయని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. మిగిలిన పాఠశాలల్లో కూడా ఎన్నికల ప్రక్రియను సకాలంలో పూర్తి



చేసేందుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.పాఠశాలల అభివృద్ధిలో తల్లిదండ్రుల భాగస్వామ్యం కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. ఎస్ఎంసీ కమిటీలు విద్యా ప్రమాణాల మెరుగుదల, మౌలిక వసతుల అభివృద్ధి, విద్యార్థుల సంక్షేమానికి కృషి చేయాలని సూచించారు. ఎన్నికైన కమిటీ సభ్యులు బాధ్యతాయుతంగా పనిచేసి పాఠశాలల అభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు. సమీక్ష సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొని ఎన్నికల నిర్వహణకు సంబంధించిన వివరాలను కలెక్టర్‌కు నివేదించారు. జిల్లాలో ఎన్నికల ప్రక్రియను పూర్తిస్థాయిలో విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పునరుద్ఘాటించారు.

# పొన్నూరులో నూతన అంగన్వాడీ టీచర్లకు నియామక పత్రాల అందజేత!

**పొన్నూరు, రాజధాని వాయిస్ :** గుంటూరు జిల్లా పొన్నూరు నియోజకవర్గ పరిధిలో అంగన్వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేసి, చిన్నారులకు మెరుగైన పౌష్టికాహారం, విద్యా సౌకర్యాలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని పొన్నూరు ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ పేర్కొన్నారు .బుధవారం పొన్నూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమం మరియు సాధికారత శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తక్కెళ్లపాడు, శేకూరుపాలెం, దొప్పలపూడి, చింతలపూడి గ్రామాలకు నూతనంగా ఎంపికైన అంగన్వాడీ టీచర్లకు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ నియామక పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా నియోజకవర్గంలోని అంగన్వాడీ కేంద్రాల్లోని 2,926 మంది చిన్నారులకు పాఠ్యపుస్తకాలు, పౌష్టికాహారం తీసుకునేందుకు ప్లేట్లు, గ్లాసులను పంపిణీ చేశారు. అలాగే 482 మంది అంగన్వాడీ టీచర్లు, ఆయాలకు దుస్తులను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే



మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యం, పోషణతో పాటు ప్రాథమిక విద్యకు అంగన్వాడీ కేంద్రాలు కీలకంగా పనిచేస్తున్నాయని తెలిపారు.

PRINTED, PUBLISHED AND OWNED BY PAGALA PURNA CHANDRA RAO. MUTUKURU (POST) DURGI MANDAL MACHERLA CONSTITUENCY. PALNADU DISTRICT.AP.DOOR N0 0-004 PINCODE 522612 PHONE NUMBER 9030343195. PRINTED AT SRI KANAKA BHARGAV OFF-SET PRINTERS. MAIN ROAD ANJANEYA COLONY REDDYPALEM GUNTUR 522009 ANDHRA PRADESH . EDITOR :PAGALA PURNA CHANDRA RAO
RNI NO :APTEL/2023/90201PHONE NUMBER : 9030343195.EMAIL. rajadhanivoicedaily@gmail.com